మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట



# ఇక పై స్మార్ట్ రేషన్

- లబ్ధిదారులకు తప్పనున్న ఇబ్బందులు
- మార్పులు, చేర్పులు మరింత సులభం
- ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమం ఆపలేదు
- స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని లాంఛనంగా ప్రారంభించిన రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు
- పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, మహబూబ్‌నగర్ కలెక్టర్ ఖుష్బూ గుప్తా



స్మార్ట్ కార్డులు అందజేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ఇకపై రేషన్ పంపిణీ వ్యవస్థ మరింత సులభతరం కానున్నదని, అత్యంత పారదర్శకంగా ఎలాంటి అవినీతికి తావు లేకుండా రేషన్ పంపిణీ వ్యవస్థకు శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటక,సాంస్కృతిక శాఖమంత్రిజూపల్లి కృష్ణారావు తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి, మహబూబ్‌నగర్ కలెక్టర్ కుష్బూ గుప్తాతో కలిసి మంత్రి జూపల్లి కృష్ణారావు స్మార్ట్ రేషన్ కార్డులపంపిణీని లాంఛనంగా ప్రారంభించారు. లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్‌కార్డులను ఆయన అందజేశారు. మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ,ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రేషన్ కార్డుల జారీకి ప్రత్యేక చర్యలుతీసుకుంటుందన్నారు.గత పదేళ్లలోకొత్త రేషన్ కార్డులు జారీ కాలేదని,ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాష్ట్రవ్యాప్తంగా వేలాదిగా కొత్త రేషన్ కార్డులను జారీ చేసినట్లు తెలిపారు. కొత్తగా కుటుంబ సభ్యుల పేర్లను చేర్చడం ద్వారా అదనంగా సన్నబియ్యం అందించే చర్యలు చేపట్టినట్లు చెప్పారు. డిజిటల్ రేషన్ కార్డులతో పారదర్శకత..సాంకేతికతను వినియోగించుకుని రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా మార్చినట్లు మంత్రి తెలిపారు. కుటుంబ సభ్యుల వివరాల్లో మార్పులు, కొత్త సభ్యుల చేరిక, వివాహం అనంతరం పేర్ల మార్పు వంటి ప్రక్రియలను మరింత సులభతరంచేయడమే స్మార్ట్ రేషన్ కార్డుల ప్రధాన ఉద్దేశమన్నారు.ప్రజలు ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవడంతో పాటు తమ పిల్లల విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని మంత్రి సూచించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకుని పిల్లలు జ్ఞానాన్ని పెంపొందించుకునేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. గ్రామాల అభివృద్ధి, స్వయం సమృద్ధి కోసం మహిళా సంఘాలు, రైతు సంఘాలు సమష్టిగా కృషి చేయాలని పిలుపునిచ్చారు.

**స్మార్ట్ రేషన్ కార్డుతో సేవలు మరింత సులభం: ఎమ్మెల్యే జీఎంఆర్**

దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పేదల ఆహార భద్రత, ఆరోగ్య భద్రతకు రేషన్ కార్డు ఎంతో కీలకమన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2014 నుంచి 2023 వరకు కొత్త రేషన్ కార్డులు జారీ చేయలేదని, కుటుంబంలో కొత్తగా చేరిన సభ్యుల పేర్లను కూడా చేర్చుకునే అవకాశం లేక అనేక మంది ప్రభుత్వ సంక్షేమ పథకాలకు దూరమయ్యారని తెలిపారు.ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త రేషన్ కార్డుల జారీకి చర్యలు చేపట్టిందన్నారు. ప్రస్తుతం మహబూబ్‌నగర్ జిల్లాలో మొత్తం 2,79,523 రేషన్ కార్డులు ఉన్నాయని,దేవరకద్ర నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో 63,367 రేషన్ కార్డులు ఉన్నాయని తెలిపారు. వీటిలో సుమారు 20వేల కొత్త రేషన్ కార్డులు ఉన్నాయని చెప్పారు. స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేస్తే కుటుంబ సభ్యులవివరాలు మొబైల్‌లో కనిపిస్తాయని వివరించారు.

**స్మార్ట్ కార్డుతో వివరాల పరిశీలన సులభం: కలెక్టర్ ఖుష్బూ గుప్తా**

జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డులోని క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా కార్డులో నమోదైన కుటుంబ సభ్యుల వివరాలను ఎప్పుడైనా సులభంగా పరిశీలించుకోవచ్చన్నారు. పేర్లు చేర్చడం లేదా తొలగించడం వంటి వివరాలను కూడా తెలుసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. దీనివల్ల లబ్ధిదారులు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం తగ్గుతుందని, రేషన్ డీలర్లకు కూడా వివరాలను స్పష్టంగా తెలియజేయడం సులభమవుతుందని తెలిపారు. లబ్ధిదారులు స్మార్ట్ రేషన్ కార్డులను సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ కోరారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.ఎల్.బి. హరిప్రియ, అసిస్టెంట్ కలెక్టర్ అండర్ ట్రైనీ సాయిశివాని, జిల్లా గ్రంథాలయసంస్థల చైర్మన్ మల్లు నంసింహారెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత,మేయర్ జి.మమత, భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ మూడావత్ బాలకోటి, డిఎస్‌సిఓ గంప శ్రీనివాస్, జిల్లా అధికారులు, స్మార్ట్ రేషన్ కార్డు లబ్ధిదారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.







మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా, ఎమ్మెల్యే జీఎంఆర్, మేయర్ గుమ్మాల మమత

# సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యం

- ప్రత్యామ్నాయ పంటల సాగుతో రైతులు మెరుగైన ఆదాయాన్ని సాధించాలి
- 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో ప్రసంగించిన ముఖ్య అతిథి డా. పట్నం మహేందర్ రెడ్డి





స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో పట్నం మహేందర్ రెడ్డి, వనపర్తి ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 15, ప్రభాతవార్త :** పేద ప్రజల సంక్షేమం, సామాజిక న్యాయమే ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్, శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి అన్నారు. 80వ భారత స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం వనపర్తి జిల్లాలోని ఐడిఓసి ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వేడుకలకు తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్, శాసన మండలి సభ్యులు పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ విప్ ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డికి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి స్వాగతం పలికారు. ముఖ్యఅతిథి పోలీస్ శాఖ ద్వారా ఇచ్చిన గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం వివిధ శాఖల ద్వారా జిల్లాలో అమలవుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు, సాధించిన లక్ష్యాలపై ప్రగతి నివేదికను చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అహింసను ఆయుధంగా చేసుకుని మహాత్మాగాంధీ సారథ్యంలో సాగిన భారత స్వాతంత్ర్య పోరాటం ప్రపంచ దేశాలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. స్వాతంత్ర్యం అనంతరం పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నాయకత్వంలో పేదరికం, అసమానతలు, అంటరానితనం వంటి సామాజిక సమస్యలపై పోరాటానికి పునాది పడిందన్నారు. ప్రజాస్వామ్య పాలనకు బలమైన పునాదులు వేసుకుని దేశం నేడు ప్రపంచంలో శక్తివంతమైన దేశంగా అభివృద్ధి చెందుతోందన్నారు. మన రాజ్యాంగంలో పొందుపర్చినట్లు మన తెలంగాణ ప్రభుత్వం సమాజంలోని అన్ని వర్గాలకు స్వేచ్ఛ, సామాజిక న్యాయం సమాన –మిగతా4లో..

# నారాయణపేట సర్వతోముఖాభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

● పశు సంవర్ధక క్రీడల శాఖ మంత్రి వాకిటి శ్రీహరి



స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మంత్రి డా. వాకిటి శ్రీహరి

**నారాయణపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త :** తెలంగాణను దేశంలోనే అగ్రగామి రాష్ట్రంగా తీర్చిదిద్దే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రైజింగ్-2047 విజన్‌తో ప్రభుత్వం ముందుకు సాగుతోందని రాష్ట్ర మంత్రి డా.వాకిటి శ్రీహరి తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా నారాయణపేట పోలీస్ పరేడ్ మైదానంలో జరిగిన వేడుకల్లో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఆవిష్కరించారు. జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డా. వినీత్, అదనపు కలెక్టర్ శ్రీను తదితరులతో కలిసి పోలీసులగౌరవ వందనాన్ని మంత్రి స్వీకరించారు సంక్షేమం, వ్యవసాయం, విద్య, వైద్యం, మౌలిక వసతులు, పరిశ్రమలు, మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. రైతు భరోసా కింద జిల్లాలో 1,82,031 మంది రైతులకు రూ.259 కోట్లు జమ చేసినట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద 6,526 ఇళ్లు మంజూరు కాగా, 3,623 ఇళ్లు పూర్తయ్యాయని పేర్కొన్నారు.మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, గృహజ్యోతి, రూ.500కే గ్యాస్ వంటి పథకాలతో ప్రయోజనం కల్పిస్తున్నామని చెప్పారు. మక్తల్ నారాయణపేట కొడంగల్ ఎత్తిపోతల పథకానికి రూ.4,725 కోట్ల పరిపాలనా అనుమతులు మంజూరయ్యాయని మంత్రి తెలిపారు. విద్యా రంగంలో ప్రభుత్వ పాఠశాలలకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్స్, వర్క్‌బుక్స్‌తో పాటు కంప్యూటర్లు అందిస్తున్నామని పేర్కొన్నారు. నారాయణపేట ప్రభుత్వ వైద్య కళాశాలకు 50 ఎంబీబీఎస్ సీట్లకు అనుమతులు లభించగా, జనరల్ ఆసుపత్రిలో 250 పడకలతో వైద్య సేవలు అందుతున్నాయని తెలిపారు. పరిశ్రమలు, చేనేత,పశు, మత్స్యరంగాలతో పాటు మహిళా స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని అన్నారు. జిల్లాలో వనమహోత్సవంలో భాగంగా 5.48 లక్షల మొక్కలు నాటినట్లు వెల్లడించారు. క్రీడా రంగంలో పేట జిల్లా క్రీడాకారులు రాష్ట్రస్థాయి ముఖ్యమంత్రి కప్ పోటీల్లో 18 పతకాలు సాధించడం అభినందనీయమన్నారు.జిల్లా సమగ్రాభివృద్ధికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు, యువత, మహిళలు, రైతులు, స్వచ్ఛంద సంస్థలు, పాత్రికేయులు సమష్టిగా కృషి చేయాలని మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం వివిధ ప్రభుత్వ శాఖల్లో –మిగతా4లో..

# పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట : మంత్రి



స్మార్ట్‌కార్డులు అందజేస్తున్న మంత్రి వాకిటి శ్రీహరి, కలెక్టర్ సిహెచ్ ప్రియాంక

**నారాయణపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త :** నారాయణపేటలోని గాయత్రి ఫంక్షన్ హాల్‌లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి వాకిటి శ్రీహరి, జిల్లా కలెక్టర్ ప్రియాంక, ఎస్పీ డా.వినీత్‌తో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి డా. వాకిటి శ్రీహరి మాట్లాడుతూ పేదలు, బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ప్రధాన ధ్యేయమని పేదలకు నాణ్యమైన సన్నబియ్యం అందించడమే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి లక్ష్యమని తెలిపారు. 80వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా పేదలు కూడా గౌరవంగా నాణ్యమైన సన్నబియ్యం తినాలనే ఉద్దేశంతోప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. రాష్ట్రంలో పండించిన సన్నరకం ధాన్యానికి గిట్టుబాటు ధరతో పాటు క్వింటాల్‌కు రూ.500బోనస్ అందిస్తూ ప్రభుత్వం కొనుగోలు చేస్తోందన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని బియ్యంగా మార్చి అర్హులైన ప్రతి వ్యక్తికి నెలకు 6 కిలోల సన్నబియ్యం అందిస్తున్నట్లు తెలిపారు. ఫుడ్ సెక్యూరిటీ స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ సరఫరాలో పారదర్శకత పెరుగుతుందని చెప్పారు. కుటుంబ సభ్యుల వివరాలు,రేషన్ పొందిన వివరాలు డిజిటల్ విధానంలో నమోదవుతాయని తెలిపారు. కొత్త రేషన్ కార్డుల మంజూరు, కుటుంబ సభ్యుల పేర్లనమోదు, తొలగింపు వంటి సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోం దన్నారు. జిల్లాలో లబ్ధిదారులు రేషన్ కోసం పక్క గ్రామాలకు వెళ్లకుండా తమ గ్రామంలోనే బియ్యం పొందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను మంత్రి ఆదేశించారు.రేషన్ డీలర్లు పేదలకు ప్రభుత్వ సంక్షేమాన్ని చేరవేసే కీలక భాగస్వాములని, వారి సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చారు. అనంతరం మంత్రి, కలెక్టర్ కలిసి లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ శ్రీను,డీఆర్వో రాజేశ్వరి,ఆర్డీవో రమేష్, మున్సిపల్ చైర్‌పర్సన్ కొండా శ్వేతా సత్యయాదవ్, వైస్ చైర్‌పర్సన్ మంజుల,మార్కెట్ కమిటీ చైర్మన్ సదాశివరెడ్డి, మత్స్య సహకార సంఘం జిల్లా అధ్యక్షుడు కాంత్‌కుమార్,ఆర్టీఏ మెంబర్‌పోషల్ రాజేష్, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి బాల్‌రాజ్, సివిల్ సప్లై జిల్లా మేనేజర్ సైదులు, తహసీల్దార్లు, మున్సిపల్ కౌన్సిలర్లు, సర్పంచులు, రేషన్ షాప్ డీలర్లు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# స్మార్ట్ రేషన్ కార్డులతో పేదలకు మరింత భరోసా

- పేదల సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట
- ఎంపీ, ఎమ్మెల్యేలతో కలిసి పంపిణీ చేసిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి
- వేడుకగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



స్మార్ట్‌కార్డులు అందజేస్తున్న ఎంపీ, ఎమ్మెల్యేలు, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు జిల్లెల్ల చిన్నారెడ్డి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వాతంత్రం అనంతరం దేశం విద్య, వైద్యం, వ్యవసాయం, ఆహార భద్రత, సామాజిక సంక్షేమం తదితర రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించిందని రాష్ట్ర ప్రణాళికసంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి అన్నారు. పేద, బడుగు, బలహీన వర్గాల సంక్షేమానికి ప్రభుత్వాలు అనేక కార్యక్రమాలను అమలు చేస్తూ ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు కృషి చేస్తున్నాయని తెలిపారు.రాష్ట్రవ్యాప్తంగా కొత్త స్మార్ట్ రేషన్ కార్డులపంపిణీ కార్యక్రమాన్నిముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించినట్లు చిన్నారెడ్డి తెలిపారు. రాష్ట్రంలో సుమారు 1.05 కోట్ల స్మార్ట్ రేషన్ కార్డులను అర్హులైన కుటుంబాలకు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇందులో భాగంగా నాగర్‌కర్నూల్ జిలా లోని నాలుగు నియోజకవర్గాల పరిధిలోని 20 మండలాల్లో 2,77,457 స్మార్ట్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు వివరించారు. స్వాతంత్ర్యానికి ముందు దేశంలో అక్షరాస్యత శాతం చాలా తక్కువగా ఉండేదని, స్వాతంత్రం అనంతరం ప్రభుత్వాలు విద్యకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో అక్షరాస్యత గణనీయంగా పెరిగిందని చిన్నా రెడ్డి అన్నారు. ప్రస్తుతం తెలంగాణలో అక్షరాస్యత 64 శాతానికి పైగా చేరుకోవడం రాష్ట్రంలో సాధించిన అభి వృద్ధికి నిదర్శనమని పేర్కొన్నారు. విద్య, వైద్యం, ఆహార భద్రతతో పాటు పేద ప్రజల జీవన ప్రమాణా లను మెరుగుపరిచేందుకు వరుసగా వచ్చిన ప్రభుత్వాలు అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేశాయని తెలిపారు. పేద ప్రజలకు నిత్యావసర సరుకులను అందుబాటులోకి తీసుకురావడంలో రేషన్ వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తోందన్నారు. రేషన్ దుకాణాల ద్వారా సబ్సిడీ ధరలకు బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందించడం వల్ల పేద కుటుంబాలపై ఆర్థిక భారం తగ్గుతుందని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారాలభిస్తున్న ప్రయోజనాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. ముఖ్యంగా తల్లిదండ్రులు తమ పిల్లల విద్యకు అధిక ప్రాధాన్యం ఇచ్చి ఉన్నత చదువులు చదివించాలని కోరారు. పేద కుటుంబాలకు ఆహార భద్రతతో పాటు విద్య, వైద్యం, గృహవసతి, ఉపాధి అవకాశాలు కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు చిన్నారెడ్డి పేర్కొన్నారు.

**ఆకలి విలువ తెలిసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి: ఎంపీ డాక్టర్ మల్లు రవి ...** ఆకలి విలువ తెలిసిన ముఖ్యమంత్రి తెలంగాణ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్నారని, అందుకే పేద ప్రజల ఆకలి తీర్చడంతో పాటు వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేలా అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారని నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి అన్నారు. దేశంలో పేద ప్రజల సంక్షేమానికి ఇంతటి ప్రాధాన్యతనిస్తూ పాలన సాగిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అని ఆయన కొనియాడారు. గతంలో పేద ప్రజలు ఆకలి చావులతో అల్లాడిన పరిస్థితులను చూశామని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం పేదల ఆహార భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తూ సన్న బియ్యం అందించడంతో ప్రతి పేద –మిగతా4లో..

# అర్హులైన వారందరికీ రేషన్ కార్డులు మంజూరు : గద్వాల కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

**గద్వాల ఆగస్టు, 15, ప్రభాతవార్త :** అర్హులైన వారందరికీ తెల్ల రేషన్ కార్డులను ఇచ్చేందుకు ప్రభుత్వం దరఖాస్తుల స్వీకరణను నిరంతర ప్రక్రియగా చేపట్టిందని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. ప్రభుత్వంప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం జోగులాంబ గద్వాల జిల్లాలో శనివారం అట్టహాసంగా నిర్వహించడం జరిగింది. కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషాషేక్, గద్వాల, అలంపూర్ శాసన సభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి, విజేయుడు, ఇతర అతిథులు పాల్గొని లబ్దిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లాలోని 1.90 లక్షల రేషన్ కార్డు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీని ప్రతిష్టాత్మకంగా నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇది దేశంలోనే తొలిసారిగా రాష్ట్రం లో స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ నిర్వహించడం గర్వ కారణమన్నారు. జిల్లాలో మొదటగా 150 మంది లబ్ధిదారులకు కార్డుల పంపిణీ చేస్తున్నామని, మిగతా లబ్ధిదారులు అందరికీ 15 రోజులలో ప్రతి రేషన్ షాపు డీలర్ల ద్వారా సర్పంచులు, గ్రామ కార్యదర్శుల సమక్షంలో అందజేయడం జరుగుతుందన్నారు.రాష్ట్ర ప్రభుత్వం అర్హులైన నిరుపేద కుటుంబాల వారి కోసం మీ సేవ కేంద్రాల ద్వారా కొత్త రేషన్ కార్డులకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం అందజేస్తున్న సన్న బియ్యం దుర్వినియోగం కాకూడదనే ఉద్దేశంతో టీ నేషన్ యాప్ ద్వారా రేషన్ బియ్యం పంపిణీ పారదర్శకంగా –మిగతా4లో..

# ప్రజాధనంతో కాంగ్రెస్ పబ్లిసిటీ

- రేషన్ కార్డులపై రాజకీయ ప్రచారం ఎందుకు?
- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాలా త్రిపుర సుందరి ధ్వజం



**జడ్చర్ల, ఆగస్టు15, ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం ప్రతిష్టా త్మకంగా చేపడుతున్న స్మార్ట్ రేషన్ కార్డుల వ్యవహారం ప్రజలకు మేలు చేయడం కంటే అధికార పార్టీ రాజకీయ ప్రచారానికే ఉపయోగపడుతోందని బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు బాలా త్రిపుర సుందరి ఆరోపించారు. పేద ప్రజలకు ఆహార భద్రత కల్పించాల్సిన రేషన్‌కార్డులను రాజకీయ ప్రచార వేదికగా మార్చడం సరికాదని ఆమె విమర్శించారు.రేషన్ కార్డులపై ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఫొటోలను ముద్రించాలనే ఆలోచన ఉంటే,అది ప్రజాధనాన్ని పార్టీ ప్రచారా నికి వినియోగించడమే అవుతుందని బాలా త్రిపుర సుందరి అన్నారు. సొమ్మొకడిది.. సోకొకడిది" అన్న చందంగా కేంద్ర ప్రభుత్వం, ముఖ్యంగా బీజేపీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న ఆహార ధాన్యాల ద్వారా పేదలకు రేషన్ సరుకులు అందుతున్నప్పటికీ, ఆ ప్రయోజనాన్ని రాష్ట్ర ప్రభుత్వం తన ఖాతాలో వేసుకుని రాజకీయ ప్రచారం చేసుకోవడం ఎంతవరకు సమంజసమని ఆమె ప్రశ్నించారు. దేశవ్యాప్తంగా పేదలకు ఆహార భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం కీలకంగా వ్యవహరిస్తోందని, ఉచిత ఆహార ధాన్యాల పంపిణీ వంటి సంక్షేమ కార్యక్రమాలకు కేంద్రం భారీగా నిధులు, వనరులు సమకూరుస్తోందని ఆమె పేర్కొన్నారు. ప్రజల పన్నుల రూపంలో సమకూరే నిధులను రాజకీయ నాయకుల వ్యక్తిగత ప్రచారానికి ఉపయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని బాలా త్రిపుర సుందరి అన్నారు. రేషన్ కార్డు అనేది ఏ ఒక్క పార్టీకి చెందినది కాదని, అది అర్హులైన పేద ప్రజల హక్కుకు సంబంధించిన ప్రభుత్వ పత్రం అని స్పష్టం చేశారు.

# ఘనంగా 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం నాగర్‌కర్నూల్ పట్టణంలోని పోలీస్ పెరేడ్ మైదానంలో ఏర్పాటు చేసిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డాక్టర్ మల్లు రవి, జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటిల్, జిల్లా ఎస్పీ డాక్టర్ సంగ్రామ్ సింగ్ జీ పాటిల్, నాగర్ కర్నూల్ శాసనసభ్యులు డాక్టర్ కూచుకుళ్ళ రాజేష్‌రెడ్డి, అచ్చంపేట శాసనసభ్యులు డాక్టర్ వంశీకృష్ణ, జిల్లా ఫారెస్ట్ అధికారి రేవంత్ చంద్ర, ఎఫ్.డి.ఓ చంద్ర ప్రకాష్, అదనపు కలెక్టర్ రెవెన్యూ బి.చెన్నయ్య, అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు దేవ సహాయం, రాష్ట్ర ప్రభుత్వం తరఫున ప్రత్యేక అతిథి తెలంగాణ రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులు –మిగతా4లో..




విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేస్తున్న దృశ్యం

# నిర్లక్ష్యానికి నిండు ప్రాణం బలి

**రోడ్డుపై మహిళను ఢీకొన్న లారీ**
**అక్కడికక్కడే మృతి**
**బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని గ్రామస్తుల రాస్తారోకో**
**రూ.50 వేల తక్షణ సాయం..**
**హామీతో ఆందోళన విరమణ**
**గంటల వ్యవధిలోనే లారీ డ్రైవర్‌ను పట్టుకున్న పోలీసులు**



రాస్తారోకో నిర్వహిస్తున్న గ్రామస్తులు

**దామరగిద్ద, ఆగస్టు 15 ప్రభాతవార్త :** దామరగిద్ద మండలంలోని గడిమున్కన్ పల్లి గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. కాలకృత్యాలు తీర్చుకు నేందుకు రోడ్డు పక్కకు వెళ్లిన వసంతమ్మ (45)అనే మహిళను యానగుంది నుంచి నారాయణపేట వైపు సిమెంట్ లోడుతో వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ఈ ప్రమాదం లో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. వసంతమ్మకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఐదు నెలల క్రితమే ఆమె భర్త మృతి చెందడంతో కుటుంబానికి వసంతమ్మే పెద్ద దిక్కుగా ఉన్నారు.ఆమె మృతితో కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరు –4లో..



## స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం!

- డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్
- కాంగ్రెస్ కార్యాలయంలో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు

**మహబూబ్‌నగర్ బ్యూరో,ఆగస్టు15, ప్రభాతవార్త:** దేశ స్వాతంత్రం కోసం తమ ప్రాణాల ర్పించిన సమరయోధుల త్యాగాలను స్మరించుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని డీసీసీ అధ్యక్షులు సంజీవ్ ముదిరాజ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రం లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు సంజీవ్‌ముదిరాజ్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడు తూ స్వాతంత్రం కోసం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు చేసిన త్యాగాలు చరిత్రలో నిలిచిపోతాయని అన్నారు. ప్రజాస్వామ్య విలువలు, సామాజిక న్యాయం కోసం కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందన్నారు. దేశాభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం ప్రతి ఒక్కరూ ఐక్యంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం వివిధ రంగాల ప్రముఖులను ఘనం గా సన్మానం చేశారు. కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ బుర్రి వెంకట్రాంరెడ్డి, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి ఏపి మిథున్ రెడ్డి, ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్, మార్కెట్ చైర్ పర్సన్ బెక్కరి అనిత, జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, నాయకులు చంద్రకుమార్ గౌడ్,ఎన్పీ.వెంకటేశ్, సీజే బెనహర్, టెక్కరి మధునూదన్ రెడ్డి, గోపాల్ యాదవ్, కృష్ణయ్య, రాములుయాదవ్, సాయిబాబా, ఎన్పీ నేహశ్రీ, పరమేష్, పసుల రాజు, కంచిమి లక్ష్మణ్, అజ్మత్‌అలీ, ప్రవీణ్ కుమార్, తాహెర్, ఫక్రు, వినయ్ కుమార్, చందుయాదవ్, అబ్రార్, హరినాథ్, మురళీగౌడ్, గంజి ఆంజనేయులు, బండి మల్లేష్, నూరుల్ హసన్, శ్రీనివాస్, నల్మాన్, ముస్తాక్ తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు సర్పంచ్ చేయూత

- సొంత ఖర్చులతో స్పోర్ట్స్ యూనిఫామ్‌ల వితరణ

**నవాబుపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులు చదువుకునేలా ప్రోత్సహించేందుకు కొండాపూర్ సర్పంచ్ కొత్త గొల్ల రాఘవేందర్ తన వంతు సహాయం అందిస్తున్నారు. మండల పరిధిలోని కొండాపూర్ గ్రామ సర్పంచ్ తన సొంత ఖర్చులతో గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉన్న విద్యార్థులందరికీ స్పోర్ట్స్ యూనిఫామ్‌లను అందజే శారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మండల విద్యాధికారి నాగ్య నాయక్ హాజర య్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య అందుతుందని, ప్రభుత్వ పాఠశాలలోనే చదువుకొని జీవితంలోఉన్నత స్థాయికి ఎదగాలని సూచించారు. ఎమ్మెల్యే అనిరుద్ రెడ్డి చొరవతో నవాబుపేట మండల కేంద్రానికి తెలంగాణ ఇంటిగ్రేటెడ్ మోడల్ స్కూల్ మంజూరు కావడం విద్యార్థులకు ఎంతో ఉపయోగకరమని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు ఉన్నత విద్య, ప్రభుత్వ ఉద్యోగాల్లో అధిక ప్రాణి ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. విద్యార్థుల కోసం సర్పంచ్ రాఘవేందర్ చేస్తున్న సేవలను గ్రామస్తులు, విద్యార్థులు, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ సందర్భంగా పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామ ప్రజాప్రతి నిధులు గ్రామస్తులు విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అన్వేషణ,సామర్థ్యం అభివృద్ధికి దోహదం

- సైన్స్ మ్యూజియంలో జెండాను ఆవిష్కరించిన డీఈవో విజయ కుమారి

**మహబూబ్‌నగర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** సైన్స్ మ్యూజియం వల్ల విద్యార్థుల్లో అన్వేషణ సామర్థం, ప్రయోగ నైపుణ్యాలు అభివృద్ధి చెందుతాయని మహబూబ్‌నగర్ జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారితెలిపారు. 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలు సైన్స్ మ్యూజి యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారి ఐ.విజయ కుమారి సైన్స్ మ్యూజియంలోజరుగుతున్న మరమ్మత్తుపనులను పరిశీలించారు. తదనం తరం సైన్స్ మ్యూజియం సందర్శించారు. అనంతరం ఏఎంఓ దుంకుడు శ్రీనివాస్ మాట్లాడు తూ ప్రణాళిక బద్ధంగా సైన్స్ మ్యూజియాన్ని అభివృద్ధి చేసుకొని జిల్లాలోని అందరు విద్యార్థులకు ఉపయోగపడే విధంగా తీర్చిదిద్దుకుందామని తెలియజేశారు. జిల్లా సైన్స్ అధికారి ఎండిశంశీర్ సైన్స్ మ్యూజియం ప్రాంగణంలోబొటానికల్ గార్డెన్ ఏర్పాటు చేసుకు నేందుకు సిజిఆర్ సంస్థకు వినతి పత్రాన్ని అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో దయాకర్, శరత్ కృష్ణ, వెంకటయ్య, రెహమాన్, నాగమణెమ్మ తదితరులు పాల్గొన్నారు.

## లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ



**దామరగిద్ద, ఆగస్టు 15 ప్రభాతవార్త:** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో భాగంగా దామరగిద్ద మండలానికి సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల ను శుక్రవారం నారాయణపేట జిల్లా కేంద్రంలో లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారు లకు స్మార్ట్ రేషన్ కార్డులను అందజేశారు. కార్యక్రమంలో తహసిల్దార్ తిరుపతయ్య, పీఏసీఎస్ చైర్మన్ పుట్టి ఈదప్ప, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బర్ల ఆనంద్, గ్రామ సర్పంచ్ అర్ధన్ కనికి రెడ్డి, శరణ్ నాయక్, ఖాజా మియా, రేషన్ డీలర్లు హరీష్, హరికృష్ణ, వెంకటరమణ, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి

**అడ్డాకుల, ఆగస్టు15 ప్రభాతవార్త :** మండల కేంద్రంలో ప్రజల సమస్యలు పరిష్కరించడానికి ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఎంపిఓ విజయ్ కుమార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సమస్యలు తీర్చడానికి పారద ర్శకత జవాబు దారితనం ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా ఆగస్టు 17వ తేదీ నుండి ప్రతి సోమవారం మండల స్థాయిలో ప్రజావాణి కార్యక్రమంలో నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎంపీవో విజయ్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రతి సోమవారం ఉదయం 10 గంటలనుండి మధ్యాహ్నం 1గంటల వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని అన్నా రు. ప్రజావాణి కార్యక్రమానికి తాసిల్దార్ తో సహా అన్ని శాఖల స్థాయి అధికారులు హాజర వుతారని, అందువల్ల ప్రజల సమస్యలు మండల స్థాయిలోని పరిష్కారం అవుతాయి అన్నారు. మండల ప్రజావాణి కార్యక్రమంలో అవసరమైన సిబ్బంది కి శిక్షణ కార్యక్రమం పూర్తి అయినది కనీస సౌకర్యాలు ప్రజావాణిలో ఉండే విధంగా అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ప్రజలు ఈ సదా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఫిర్యాదు లను మండల ప్రజావాణిలో ఇచ్చి పరిష్కరించుకోవచ్చని సూచించారు.

## ఉత్తమ గ్రామ పంచాయతీగా మాన్‌దొడ్డి




ఉత్తమ గ్రామ పంచాయతీ అవార్డు అందుకుంటున్న సర్పంచ్ సుజిత బాబురావు

**వడ్డేపల్లి, ఆగస్టు 15 ప్రభాతవార్త :** రాజోలి మండల పరిధిలోని మాన్‌దొడ్డి గ్రామం ఉత్తమ గ్రామ పంచాయతీగా ఎన్నికై నేడు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు చేతుల మీదుగా ప్రశంస పత్రాన్ని సర్పంచ్ జి. సుజాత బాబురావు, పంచాయతీ కార్యదర్శి వీరేష్ అందుకున్నారు. ఈ సంద ర్భంగా జి.సుజాత బాబురావు మాట్లాడుతూ మాన్‌దొడ్డి గ్రామం జిల్లా స్థాయిలో ఉత్తమ పంచాయతీగా ఎన్నికైనందున సంతోషంగా ఉందని, గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు, యువకులు, మహిళల సహకారంతో గ్రామాన్ని మరింత అభివృద్ధి చెందే విధంగా నా వంతు కృషి చేస్తానని అన్నారు.

## గట్టు కాడిపల్లి పాఠశాల విద్యార్థులకు సెంథిల్ వితరణ

**ఉప్పునుంతల, ఆగష్టు15 ప్రభాతవార్త:** మండల కేంద్రమైన ఉప్పునుంతల గ్రామపంచాయతీ శివారు గ్రామమైన గట్టు కాడిపల్లి పాఠశాల విద్యార్థులకు ఉప్పునుంతల మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి బెంచిల్, సామాగ్రి వితరణ చేశారు. పాఠశాల అభివృద్ధికి తమ వంతు కృషి చేయడం జరుగుతుందని, వచ్చే సంవత్సరం నుంచి విద్యార్థుల సంఖ్య పెంచి వారికి నాణ్యమైన విద్య అందించేలా కృషి చేస్తామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. తమ పిల్లలు చదువుకుంటున్న బడికి మాజీ ఎంపీపీ తిప్పర్తి అరుణ నరసింహారెడ్డి అందించిన సహకారం అభినందనీయమని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినందించారు. మాజీ ఎంపీపీ, వార్డుసభ్యుడుకుందేటిలక్ష్మయ్య,పాఠశాలహెచ్ఎం,ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

# ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు



జాతీయ జెండావిష్కరణ వేడుకల్లో ఎమ్మెల్యే, ఎంపీ




మక్తల్‌లో జాతీయ జెండాను ఆవిష్కరించిన మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు , హాజరైన మంత్రి వాకిటి శ్రీహరి



పియులో స్వాతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



జాతీయ జెండాకు సెల్యూట్ చేస్తున్న తహసీల్దార్ ఎల్లన్న







జాతీయ నాయకుల వేషధారణలో చిన్నారి విద్యార్థులు

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య ఉద్యమంలో ఎందరో అమరవీరుల త్యాగాల ఫలితంగా దేశానికి స్వాతంత్ర్యం రావడం జరిగిందని, దానివల్లే ప్రజలకు స్వేచ్ఛ, సమా నత్వం, హక్కులు అందుతున్నాయని ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి అన్నారు. శనివారం 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పార్టీ కార్యాలయ స్థలంలో, పాత మార్కెట్ యార్డ్ సమీపంలో జాతీయ జెండాను ఎమ్మెల్యే డాక్టర్ రాజేష్ రెడ్డి మరియు పార్లమెంట్ సభ్యులు మల్లు రవిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ అమరవీరుల త్యాగా లను స్మరించుకోవాలని అన్నారు. రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ స్వరా జ్యానికి పెద్దపీట వేయడం జరిగిందని, గ్రామాల లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్క రించేందుకుతమ సర్కారుకృషి చేస్తుందని అన్నా రు. యువత అసాంఘిక కార్యక్రమాల వైపు దృష్టి సారించకుండా సమాజ సేవ కోసం దృష్టి సారించాలని కోరారు.

**కల్వకుర్తి, ఆగస్టు 15, ప్రభాతవార్త:** 80వ స్వాతం త్ర్య దినోత్సవ వేడుకలు కల్వకుర్తి పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ,ప్రైవేటు కళాశాలలు, పాఠశాలలతో పాటు వివిధ పార్టీల ఆధ్వర్యంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు నిర్వహించారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో, మున్సిపాల్ కార్యాలయంలో, మార్కెట్ యార్డ్, ప్రభుత్వాసు పత్రిలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి తివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు. ఆర్డీఓ కార్యాలయ ంలో ఆర్డీఓ జనార్ధన్‌రెడ్డి, ఎంపీడీఓ కార్యాలయం లో ఎంపీడీఓ వెంకట్రాములు, తహసీల్దార్ కార్యాలయం ముందు తహసీల్దార్ ఇబ్రహీం, కోర్టు ఆవరణలో న్యాయమూర్తి , పోలీస్‌స్టేషన్ కార్యాల యం ముందు ఎస్ఐ కురుమూర్తి, డీఎస్పీ కార్యాల యం ముందు డీఎస్పీ వెంకట్‌రెడ్డి, సీఐ కార్యాల యంముందు సీఐ,కల్వకుర్తి డిపో కార్యాలయంలో డిపో మేనేజర్, అగ్రికల్చర్ ఏడీఏ కార్యాలయం ముందు ఎడీఎశ్రీనివాసులు, ఎక్సైజ్ కార్యాలయం లో సీఐ లయన్స్‌క్లబ్ వద్ద లయన్స్‌క్లబ్ అధ్యక్షులు చిగుళ్లపల్లి శ్రీధర్, పీఏసీఎస్ కార్యాలయం వద్ద పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్ధన్‌రెడ్డి, గ్రామ పంచాయతీల్లోప్రత్యేకాధికారుల అధ్యక్షతన జాతీ య జెండాను ఎగురవేశారు.గొర్రె కాపరుల భవ నం, నాయి బ్రాహ్మణ భవనం, శ్రీకృష్ణ భవనం, ఓల్డేజ్‌హోం వద్ద ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొన్నారు.కల్వకుర్తి పట్టణంలోని డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద నిర్వహించిన స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో మాజీసర్పంచ్ బృంగి ఆనంద్ కుమార్ హజరై జెండావిష్కరణ గావించారు. పట్టణంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఆవరణలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ జెండాను ఆవిష్కరించారు.

**వాసవీక్లబ్ ఆధ్వర్యంలో జెండావిష్కరణ:** 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్క రించుకొని కల్వకుర్తి వాసవీక్లబ్ ఆధ్వర్యంలో ఇంటర్ నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జూలూరి రమేష్ బాబు ఆధ్వర్యంలో జెండావి ష్కరణ గావించారు. అంతకు ముందు వాసవీక్లబ్ ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

**మక్తల్ టౌన్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** మక్తల్ మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వ హించారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర క్రీడా, పాడి పరిశ్రమాభివృద్ధి, పశుసంవర్ధక, మత్స్య, యువ జన సేవల శాఖా మంత్రి వాకిటి శ్రీహరి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. మున్సిపల్ చైర్ పర్సన్ జాతీయ జెండాను మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హనుమంతు ఆవిష్కరించిన అనం తరం జాతీయ గీతాలాపనతో దేశభక్తి వాతావ రణం నెలకొంది.ఈ సందర్భంగా మంత్రి వాకిటి శ్రీహరి మాట్లాడుతూ స్వాతంత్ర్య సమర యోధుల ఆశయాలకు అనుగుణంగా దేశ అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపుని చ్చారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ వాకిటి మానస హన్మంతు, పట్టణ కౌన్సిలర్లు, అధికారులు,సిబ్బంది, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, పట్టణ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.



మక్తల్ పోలీసు కార్యాలయంలో జాతీయ జెండా ఆవిష్కరిస్తున్న సీఐ రాంలాల్







**మహబూబ్‌నగర్, ఆగస్టు15, ప్రభాతవార్త :** 80వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పాలమూరు విశ్వవిద్యాలయంలో శనివారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. విశ్వవిద్యా లయం పరిపాలన భవనంలో ఉపకులపతి ప్రొ॥ జి.ఎన్. శ్రీనివాస్ జాతీయ పతాకాన్ని ఆవిష్కరిం చారు.ఈ కార్యక్రమంలోఓఎస్డీ టు వైస్ ఛాన్సలర్ ప్రొ॥ డి. మధుసూదన్ రెడ్డి, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ ప్రొ॥ ఎన్. చంద్రకిరణ్, ప్రొ॥ ఎం. నూర్జహాన్, పరీక్షల నియంత్రణ అధికారి డా. కె. ప్రవీణ,ఐక్యుఏ సి డైరెక్టర్ డా.కె.రాజ్ కుమార్ పాల్గొన్నారు.

**చిన్న చింతకుంట, ఆగస్టు15 ప్రభాతవార్త :** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ ఎల్లన్న, మండల పరిషత్‌లో ఎంపీడీవో అనురాధ, వ్యవసాయ శాఖ కార్యాల యంలో ఏవో రాజేష్ ఖన్నా, పోలీస్ స్టేషన్‌లో ఏఎస్ఐ వెంకటస్వామి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ శిరీష ,ఎస్సీ హాస్టల్ లో వార్డెన్ విజయ్, గ్రామ సచివాలయంలో సర్పంచ్ మానస దశరథ్, మండల వనరుల భవనంలో ఎంఈఓ మురళీకృష్ణ, ఆయా గ్రామాలలోని గ్రామ సచివాల యంలో సర్పంచులు, అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వపాఠశాలల్లో జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా ఆయా శాఖల అధికారులు మాట్లాడుతూ ఎందరో త్యాగధనుల వల్ల స్వాతంత్రం సిద్ధించిందని వారి ఆశయాలకు అనుగుణంగా యువత పనిచేయాలని వారు సూచించారు. స్థానిక సాందీప పాఠశాలవిద్యార్థులు జాతీయ నాయకుల వేషధారణతో ప్రభాతభేరి లో పాల్గొన్నారు. ఆయా శాఖల అధికారులు జాతీయ నాయకుల వేషధారణతో ఉన్న చిన్నారులను అభినందించారు.వందేమాతరంపూర్తిగా పాడలేదని బిజెపి నాయకులు అసహనాన్ని వ్యక్తం చేశారు. పార్లమెంటులో చట్టంగా మారిన పూర్తిగా వందేమాతరం పాడకపోవడం చట్టాన్ని ఉల్లంఘిం చడం అని బిజెపి నేతలు నంబిరాజు, కురువ రమేష్ లు ఆగ్రహాన్ని వ్యక్తం చేశారు. ఈ స్వాతంత్ర వేడుకల్లో అన్ని రాజకీయ పక్షాల నాయకులు, యువత పాల్గొన్నారు.

**దామరగిద్ద, ఆగస్టు 15 ప్రభాతవార్త:** దామరగిద్ద మండల కేంద్రంతో పాటు మండల పరిధిలోని వివిధ గ్రామాల్లో శనివారం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు.పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో జాతీయపతాకాలను ఆవిష్కరించి జాతీయ గీతాన్ని ఆలపించారు.గ్రామాల్లో నిర్వహించిన వేడుకల్లో సర్పంచులు, ప్రజాప్రతినిధులు,వివిధ పార్టీల నాయకులు,ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువ కులు, గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**బిజినేపల్లి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ ప్రైవేటు కార్యా లయాలపై జాతీయ పతాకాలను ఆవిష్కరించి జాతీయ గీతాలను ఆలపించారు.తహసిల్దార్ మునీరుద్దీన్, ఎంపీడీవో కథలప్ప, ఏవో కమల్ కుమార్, ఐకెపి ఎపిఎం, ఈశ్వర్ , పిఆర్ డిఇ జవహర్‌బాబు ,ఎస్సై శంషుద్దీన్, పిఏసిఎస్ చైర్మన్ నాయినోళ్ల బాలరాజ్ గౌడ్, జాతీయ పతాకా లను ఆవిష్కరించారు. అధికారులు డిప్యూటీ తహసి ల్దార్ చిక్కుడు రవికుమార్, పిఏసిఎస్ సీఈఓ రవీందర్, పాల్గొన్నారు. అన్ని గ్రామాల గ్రామ పంచాయతీలవద్ద సర్పంచులు ఆలేటి సుగుణమ్మ, మిద్దె ఇందిరా,జాలంనాగయ్య యాదవ్, ఉప్పల మోని లక్ష్మమ్మ,జంగిటి కోటేశ్వర్, నర సింహారెడ్డి, అబ్బ రాములు, గడ్డంపల్లి ప్రశాంత్ రెడ్డి, నాగోలు నాగిరెడ్డి,సురభి ఉమారాణి, డి.ప్రణీత, మారేపల్లి శివలీల, పిట్టల చంద్రకళ , ఏటవాళి సరోజనమ్మ, ఎండి జైనలాబుద్దిన్, ఆంజనేయులు,పిట్టల జ్యోతి ,మట్ట ఇందిరమ్మ, లేట్ల బాలస్వామి, బోనాసి రామకృష్ణ, కొంగరి శంకర్, పానుగంటి మాధవి, మునీందర్‌నాయక్, వి.జ్యోతి,రాత్లావత్ రామ చందర్,ఇస్లావత్‌పూల్యా,రాత్లావత్ సక్రు, మూడ వత్ గోపాల్, మూడవత్ కృష్ణ, కే.బుజ్జి , రాత్లా వత్ విజయ , వర్యవత్ గోరి , కేతావత్ లలిత , కేతావత్ సరోజ, అధికారులు పాల్గొన్నారు.

**నవాబుపేట, ఆగస్టు 15 ప్రభాతవార్త :** మండల వ్యాప్తంగా 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. తహసీల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ సురేష్ ఎంపీడీవో కార్యాలయం, జై రామ్ నాయక్ గ్రామపంచాయతీ కార్యాలయంలో ,ఎంఈఓ కార్యాలయంలో నవాబుపేట పోలీస్ స్టేషన్‌లో ఎస్ఐ నరేందర్ తో పాటు పలు ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు తానేం సురేష్‌జెండా ఆవిష్కరించారు.వివిధ ప్రభు త్వ కార్యాలయాల్లో అధికారులు జాతీయ జెండా ను ఆవిష్కరించారు.అలాగే మండలంలోని వివిధ గ్రామాల్లోగ్రామపంచాయతీ కార్యాలయాల్లో అధికా రులు, ప్రజాప్రతినిధులు,సర్పంచులు, నాయకులు జెండాఆవిష్కరణ కార్యక్రమాల్లో పాల్గొని స్వాత ంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.

**ఉప్పునుంతల, ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ప్రభు త్వ, ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు పలు జాతీయ నాయకుల వేషధరణతో ప్రభాత భేరి నిర్వహిం చారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు నిర్వహించిన విన్యాసాలు పలువురిని ఆకట్టు కుంది. అనంతరం ఆయా గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద జెండా ను ఎగుర వేశారు. తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసి ల్దార్ అద్దంకి సునీత, ఎంపిడిఓ కార్యాలయం వద్ద ఎంపిడిఓ వరుణ్ తేజ, స్థానిక ఎం ఆర్ సి వద్ద మండల విద్యాధికారి జటప్రోలు శ్రీనివాస్ రెడ్డి, పోలీస్ స్టేషన్ వద్దఎస్సై పుట్ట మహేష్, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ చింత గాళ్ళ శ్రీనివాసులు, వైద్యశాల ల వద్ద ఫార్మసిస్ట్ కుమార చారి, డాక్టర్ ప్రవీణ్ కుమార్, ఉప్పునుంతల క్లస్టర్ పరిధిలోని రైతు వేదిక వద్ద మండల వ్యవసాయ శాఖ అధికారి కొర్ర రమేష్, ఐకెపి వద్ద మండల మహిళా సమాఖ్య కార్యదర్శి పెద్దిరెడ్డి సునీత, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (సింగిల్ విండో) వద్ద చైర్మన్ మద్దు నరేందర్ రెడ్డి,పి ఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద హెచ్ ఎం నీల శ్రీధర్,సబ్ స్టేషన్ వద్ద సీనియర్ లైన్ ఇన్స్పెక్టర్ నరేందర్, డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ సంఘం అధ్యక్షుడు పాత్కుల కుర్మయ్య, మైలు స్టోన్ స్కూల్ వద్ద ప్రిన్సిపాల్ ఉన్ని కృష్ణన్ లు జాతీయ జెండాను ఎగురవేశారు. ఈ ఉప తహసీల్దార్ రమేష్, మండల పంచాయతీ అధికారి చంద్రశేఖర్, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సూపరిం టెండెంట్ డాక్టర్ శంకర్, వైద్య అధికారిణి డాక్టర్ స్వప్న, డాక్టర్ బిక్కులాల్, ఐకెపి ఎపిఎం బాల చందర్,ఎపిఓ పర్వతాలు, సింగిల్ విండో సిఇఒ కొత్త రవీందర్ రావు,ఉప సర్పంచ్ అంతటి శైలజ వెంకటయ్యగౌడు, అన్ని శాఖల అధికారులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**వెల్టూర్‌లో:** స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా మండలంలోని వెల్టూరు గ్రామంలో గ్రామ పంచా యతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ చింతోజు వెంకటేష్, ప్రాథమిక,జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వద్ద పాఠశాల హెచ్ ఎం ఆంజనేయులు, పశు వైద్యశాల వద్ద, జాతీయ జెండాను ఎగురవే శారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**అయ్యవారిపల్లిలో:** మండలంలోని అయ్యవారిపల్లి గ్రామంలో గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ జిల్లెల్ల జగత్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.

**పెనిమిళ్ళలో:** గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ మెడ సాని శ్రీలత విజేందర్ రెడ్డి జాతీయ జెండాను ఎగురవేశారు.ఆదే విధంగా గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమిక, ఉన్నత పాఠశాలలో ఆయా పాఠశాలల హెచ్ఎం లు జెండాను ఎగుర వేశారు.

**ఉప్పరిపల్లిలో:** మండలంలో ని ఉప్పరపల్లిలో స్వాతంత్ర దినోత్సవ సందర్భంగా గ్రామపం చాయతీ కార్యాలయం వద్ద గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి చేతుల మీదుగా జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్‌తో పాటు సిఎం ప్రవాసి ప్రజావాణి రాష్ట్ర కోఆర్డినేటర్ బొజ్జ అమరేందర్‌రెడ్డి వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**దేవరకద్ర, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వాతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకొని ఎంపీడీవో, తహసిల్దార్ కార్యాలయాలలో జాతీయ జెండాను ఎంపీడీవో శ్రీనివాసరావు, తాహసీల్దార్ హర్షద్ అలీ,ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అధికారులు, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, యువ కులు, జాతీయ జెండాకు గౌరవ వందనం సమర్పించి, దేశభక్తిని చాటుకున్నారు.అనంతరం స్వాతంత్ర సమరయోధుల త్యాగాలను స్మరించు కున్నారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, నాయకులు, యువకులు, మహిళలు, దేశభక్తి వేషధారణ చిన్నారులు, తదితరులు పాల్గొన్నారు.

**జెండా ఆవిష్కరించిన జిల్లా జూనియర్ సివిల్ జడ్జి:** దేవరకద్ర మండల కేంద్రంలోని జూనియర్ సివిల్ జడ్జ్ జ్యూడిసియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు నందు స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా జూని యర్ సివిల్ జడ్జ్ శ్రావణ్ కుమార్ జెండా ఆవిష్క రించారు. ఈ సందర్భంగా జాతీయ గీతాన్ని ఆలపించి,దేశ స్వాతంత్రానికి ప్రాణాలు అర్పించిన వీరుల త్యాగాలను స్మరించుకున్నారు. అనంతరం దేశభక్తి వేషధారణలో ఉన్న చిన్నారులకు నోట్ బుక్‌ను పంపిణీ చేశారు. చిన్నారులను అభినంది స్తూ విద్యతోపాటు దేశభక్తి జాతీయ విలువలను పెంపొందించుకోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో కోర్టు సిబ్బంది, ఎంపీడీవో శ్రీనివాసరావు, తాహసిల్దార్ హర్షద్, దేవరకద్ర ఎస్సై భాస్కర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

**ఆత్మకూర్ ఆగస్టు 15, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలో శనివారం రోజు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని మున్సిపల్ కార్యా లయ ఆవరణలో మున్సిపల్ చైర్ పర్సన్ నాగ మణి తాసిల్దార్ కార్యాలయ ఆవరణలో తాసిల్దార్ మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఎంపీడీ వో శ్రీ రామ్ రెడ్డి మార్కెట్ కమిటీ కార్యాలయ ఆవరణలో మార్కెట్ కమిటీ చైర్మన్ రహమతుల్లా ఆత్మకూర్ పోలీస్ సర్కిల్ కార్యాలయ ఆవరణలో సర్కిల్ ఇన్స్పెక్టర్ శివకుమార్ తదితరులు స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని జాతీయ జెండాలను ఎగురవేశారు. ఎం.వి.రామన్ పాఠశాల ఆవరణలో విద్యార్థినీ విద్యార్థులు సంస్కృతిక ప్రదర్శనలు నిర్వహించిన నేపథ్యంలో ప్రజ లు పెద్ద ఎత్తున తరలివచ్చి తిలకించారు. పట్టణం లోని శ్రీవాణి పాఠశాలకు చెందిన విద్యార్థిని విద్యా ర్థులు దేశ నాయకుల వేషధారణలో ప్రభాతభేరి నిర్వహించి పలువురిని విశేషంగా ఆకర్షించారు. ఆయా ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన మరియు ఉపన్యాస పోటీలలో విజయం సాధించిన విజేతల కు ప్రిన్సిపల్ లతాగంగాధర్ మున్సిపల్ చైర్ పర్సన్ నాగమణి బహుమతులు అందజేశారు.

**కోయిలకొండ ఆగస్టు15 ప్రభాతవార్త:** కోయిల కొండ మండలంలో శనివారం స్వాతంత్ర దినోత్స వ వేడుకలు ఘనంగా జరిగాయి. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలలో మువ్వన్నెల జెండాను ఎగరవేసి స్వాతంత్ర దినోత్సవ పర్వదిన వేడుకలు అంగరంగ వైభవంగా కోయిలకొండ మండలంలో నిర్వహించారు. మండల తహసిల్దార్ కార్యాల యంలో మండల తహసిల్దార్ రాజా గణేష్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఎంపీడీవో కార్యా లయంలో ఎంపీడీవో ధనుంజయ్ గౌడ్, పోలీస్ స్టేషన్లో ఎస్సై నాగరాజు, గ్రామపంచాయతీ కార్యా లయంలో గ్రామ సర్పంచ్ సుజాత ఆనంద్, వ్యవ సాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారి యామారెడ్డి,ఐకెపి కార్యాలయంలో ఇన్చార్జ్ ఏపిఎం మల్లేష్, వివిధ కార్యాలయాల లో జాతీయ జెండాను ఎగురవేసి స్వతంత్ర దినోత్సవ పర్వదిన వేడుకలను జరుపుకున్నారు.ఈ కార్య క్రమంలో వివిధ పార్టీల ప్రతినిధులు , గ్రామస్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

**జడ్చర్ల ఆగస్టు15, ప్రభాతవార్త:** భారతీయ జనతా పార్టీ జడ్చర్ల మండల పార్టీ కార్యాలయం లో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనం గా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు యాట రామకృష్ణ ముదిరాజ్ ఆధ్వర్యంలో జాతీయ జెండాను ఆవిష్కరించి, జాతీయ గీతాన్ని ఆలపించారు.ఈ కార్యక్రమంలో మండల ఇంచార్జ్ సామల నర్సింలు మండల ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్ మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ యాదవ్ మండల ఉపాధ్యక్షులు మహేష్ యాదవ్ బీజేవై మండల అధ్యక్షులు కొండ గణపతి గుప్తా, మండల పదాధికారులు, ధనుంజయ్ లింగం యాదగిరి సాయికుమార్ జీవన్, బూత్ అధ్యక్షులు, నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొని స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకున్నారు.














# రెపరెపలాడిన మువ్వన్నెల జెండా

◆ ఘనంగా స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ◆ అలరించిన విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు



భూత్పూర్ మున్సిపాలిటీ వద్ద జాతీయ జెండానావిష్కరిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్















**భూత్పూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త :** భారత 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు శనివారం భూత్పూర్ పట్టణ, రూరల్ ప్రాంతాల్లో ఘనంగా జరిగాయి. ఎనభై వసంతాల తిరంగా జెండాను ఎంతో సంబురంగా ఎగుర వేసి ఉత్సవాలు నిర్వహించారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాలయాలు, గ్రామ పంచాయతీలు, వివిధ సంఘాల కార్యాలయాల వద్ద నిర్వహకులు జాతీయ రెండాను ఎగురవేసి వేడుకలు నిర్వహించారు. భూత్పూర్ మున్సిపాలిటీలో జరిగిన జెండా పండుగకు దేవరకద్ర ఎమ్మెల్యే గవినోళ్ల మధుసూదన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై జాతీయ జెండానెగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే జీఎంఆర్ మాట్లాడుతూ దేశస్వాతంత్ర్యం కోసం త్యాగాలు చేసిన మహనీయుల్ని స్మరించుకుంటూ, రాష్ట్ర ప్రగతిలో ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎమ్మెల్యే జీఎంఆర్ పిలుపునిచ్చారు. ప్రజా సంక్షేమం కోసం ఆహర్నిశలు శ్రమిస్తూ సీఎం రేవంత్‌రెడ్డి అనతికాలంలోనే ప్రజాభిమానాన్ని చూరగొన్నారన్నారు. రెండున్నరేళ్లుగా సంక్షేమ పథకాలు అమలు చేస్తూ నిజమైన ప్రజాస్వామ్య ప్రజాపాలన అందిస్తున్నారని అన్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ఫించన్లు, బీపీఎల్ కుటుంబాలకు స్మార్ట్ కార్డులు అందజేస్తున్నారని పేర్కొన్నారు. గత పదేళ్లలో జరగని అభివృద్ధిని గడిచిన మూడేళ్లలోపే తమ సీఎం సీఎం చేసి చూపెడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ముడావత్ బాలకోటి, కమిషనర్ జె పవన్‌కుమార్, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు డాక్టర్ కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ కదిరె శేఖర్‌రెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు నిమ్మలఅన్నపూర్ణ(రెండవ వార్డు), పాల్యావత్ లాల్య (లాలు)నాయక్(మూడో వార్డు), గడ్డం ప్రేమ్‌కుమార్(నాల్గోవార్డు), కెంద్యాల పద్మ(ఐదోవార్డు), లత సూరన్నగారి(ఏడోవార్డు), చంద్రకళ(తొమ్మిదోవార్డు)లతో పాటు కోఆప్షన్ సభ్యులు అఫ్రోజ్, కొరె పవన్, లావణ్య, తన్వీర్‌సుల్తానాలతో పాటు నాయకులు బోరింగ్‌నర్సింహులు, కెంద్యాల రాజేష్, కెంద్యాల నరేందర్, నిమ్మలసాయిరామ్‌యాదవ్, జమీర్, పులుగుర్ల మల్లేష్, గడ్డంఎల్లప్ప, గడ్డం యాదయ్య, ఆర్పీలుసువర్ణ, విజయలక్ష్మి, ధనలక్ష్మి, అనురాధ, బాలస్వామి పాల్గొన్నారు.

● వెటర్నరీ ఆసుపత్రి వద్ద పశువైద్యాధికారి డాక్టర్ మధుసూధన్, సింగిల్ విండ్ కార్యాలయం వద్ద పీఏసీఎస్ చైర్మన్ కదిరె అశోక్‌రెడ్డి, సీఈఓ రత్నం .ఎమ్మార్సీ భవన్ వద్ద ఎంఈఓ ఉషారాణి జాతీయ జెండానెగుర వేయగా, సీఆర్పీలు ఠాగూర్, ఇక్రమ్, నాగేందర్, ఇంతియాజ్ పాల్గొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం వద్ద ఎంపీడీఓ ఉమాదేవి. పీహెచ్‌సీ వద్ద ఎంఓ డాక్టర్ మొహ్మద్ అబ్దుల్ రబ్. వ్యవసాయ కార్యాలయం వద్ద వ్యవసాయాధికారి మురళీధర్ జెండా ఎగుర వేశారు. ఈ కార్యక్రమంలో తూము శ్రీనివాస్‌రెడ్డి, మేకల సత్యనారాయణ, బజార్ పరుశురాం, మేకల వేణు తదితరులు పాల్గొన్నారు. తహసిల్ కార్యాలయం వద్ద తహసిల్దార్ కిషన్‌నాయక్ జాతీయ జెండానెగుర వేసి జాతీయ జెండా ప్రాముఖ్యతను, స్వాతంత్ర్య దినోత్సవ విశిష్టతను తెలిపారు. ఈ కార్యక్రమంలో డీటీ గీత ఇతర ఉద్యోగులు పాల్గొన్నారు. పీఎంశ్రీ జిల్లా పరిషత్ ఉన్నతపాఠశాలలో జీహెచ్‌ఎం ఆనందమ్మ జాతీయ జెండానావిష్కరించారు. సీపీఎస్‌లో హెచ్‌ఎం యాదయ్య జెండాను ఎగురవేశారు. బీసీ కాలనీలోని ఉర్దూ మీడియం బాలికల పాఠశాలలో హెచ్‌ఎం ప్రభాకర్ జాతీయ జెండానెగుర వేశారు. సాహితీ హైస్కూల్‌లో మున్సిపల్ మాజీ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్‌గౌడ్ జాతీయ జెండాను ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ డాక్టర్ సత్య నారాయణ పాల్గొన్నారు.

● బీసీ కాలనీలోని ఠాగూర్ మెమోరియల్ స్కూల్‌లో కరస్పాండెంట్ గొడుగు జాతీయ జెండానెగుర వేయగా, ప్రిన్సిపాల్ కాడ్లూర్ చాముండేశ్వరి ఇతర ఉపాధ్యాయురాళ్లు సన, పుష్ప, రాణి, సృష్టి, వినీత్ కుమార్ పాల్గొన్నారు. న్యూ ఎరాహైస్కూల్‌లో కరస్పాండెంట్ విక్రాంతికుమార్ జాతీయజెండానెగురవేశారు.

**సిద్దయ్యపల్లిలో:** భూత్పూర్ మున్సిపాలిటీలోని ఒకటోవార్డు సిద్దయ్యపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఘనంగా జరిగాయి. హెచ్‌ఎం రవి చంచల జాతీయ జెండానెగుర వేసి, జెండా విశిష్టతను పిల్లలకు వివరించారు.

**అన్నాసాగర్‌లో:** భూత్పూర్ మండలం అన్నాసాగర్‌లో గ్రామ సర్పంచి గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద ఆల శ్రీకాంత్‌రెడ్డి జాతీయ జెండానెగుర వేశారు. పంచాయతీ సభ్యులు వేడుకల్లో పాల్గొన్నారు. తాటిపర్తిలో ..మండలంలోని తాటిపర్తి గ్రామంలో సర్పంచి హబీబా ఫసియోద్దీన్ జాతీయ జెండానెగుర వేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచులు ఎండి ఫసియోద్దిన్, ఆకుల వెంకటయ్య పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

**భట్టుపల్లిలో:** భట్టుపల్లి గ్రామంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్ని సర్పంచి రేకులపాటి లక్ష్మమ్మరఘుపతిరెడ్డి నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. సర్పంచి లక్ష్మమ్మరఘుపతిరెడ్డి జాతీయ జెండానెగుర వేశారు. ఈ కార్యమ్రంలో వార్డు సభ్యులు, నాయకులు రేకలపాటి రఘుపతిరెడ్డి, రేకలపాటి భూపతిరెడ్డి, రేకులపాటి సుదర్శన్‌రెడ్డి, గంగాధర్, మాజీ సర్పంచి గోపాల్‌రాజ్ పాల్గొన్నారు. భట్టుపల్లి తండా ఏవీఆర్‌కాలనీలో.. భూత్పూర్ మండలం భట్టుపల్లి తండా ఏవీఆర్‌కాలనీ గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచి తారు నాయక్ జాతీయ జెండాను ఎగుర వేయగా, ఉపసర్పంచి సభావత్ జైపాల్ నాయక్ ఇతర పంచాయతీ సభ్యులు పాల్గొన్నారు.

**అచ్చంపేట, ఆగస్టు, 15 ప్రభాతవార్త:** పట్టణంలో వివిధ ప్రభుత్వ కార్యాలయాల్లో జాతీయ జెండా ఎగురవేసి స్వాతంత్ర దినోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ స్వాతంత్ర వేడుకల్లో స్థానిక ఎమ్మెల్యే డా. వంశీకృష్ణ హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ దేశాభివృద్ధికి ప్రతి ఒక్కరూ తమ వంతు కృషి చేయాలని పిలుపునిచ్చారు. పట్టణంలో ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ యాదగిరి జండా ఎగరవేశారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సైదులు, డీఎస్పీ పల్లె శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ మురళి, ఆర్‌డబ్ల్యుఎస్ డీఈ హేమలత, ఎంపిడిఓ మురళీధర్, తదితరులు జాతీయ జండా ఎగురవేసి స్వాతంత్ర దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు.

**లింగాల, ఆగస్టు, 15 ప్రభాతవార్త:** భారతదేశ 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ కాన్సెప్ట్ స్కూల్ కరస్పాండెంట్ చెన్న శ్రీనివాసులు, ప్రిన్సిపాల్ పరశురాములు ఆధ్వర్యంలో విద్యార్థులు ప్రభాతభేరిలో భాగంగా ప్రధాన కూడాల్లో భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలు ఉట్టిపడేలా ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి .గ్రామపంచాయతీ వద్ద సర్పంచ్ పూజారి ఈశ్వరమ్మ బుద్దయ్య జాతీయ జెండాను ఎగురవేసి వందనం సమర్పించారు. హై స్కూల్ వద్ద ఎంఈఓ బషీర్ అహ్మద్, ఎస్టీ బాలుర వసతి గృహంలో హెచ్ డబ్ల్యు ఓ సనాతన బాలస్వామి, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో హెచ్ డబ్ల్యు ఓ మంగమ్మ, శ్రీకృష్ణ పాఠశాలలో ప్రిన్సిపాల్ పరశురాములు, వ్యవసాయ కార్యాలయం వద్ద ఏవో అనిల్ జాతీయ జెండాను ఎగురవేశారు. అదేవిధంగా పశువుల దవఖాన వద్ద పశువైద్యాధికారిని డాక్టర్ ప్రియాంక, సింగిల్ విండో కార్యాలయం వద్ద పిఎసిఎస్ చైర్మన్ హనుమంత్ రెడ్డి, కేజీబీవీ వద్ద ఎస్ఓ శారద, మినీ గురుకులం వద్ద హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, గురుకుల కళాశాల వద్ద ప్రిన్సిపాల్ శ్రీనివాసులు జాతీయ జెండాకు వందనం సమర్పించి మిఠాయిలను పంచిపెట్టి దేశభక్తిని చాటుకున్నారు. విద్యార్థులకు నిర్వహించిన పోటీలో గెలుపొందిన విజేతలకు ప్రిన్సిపల్ శ్రీనివాసులు ప్రధానం చేశారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద ఎంపీడీవో విజయలక్ష్మి, తహసిల్దార్ కార్యాలయం వద్ద తాసిల్దార్ వెంకటేష్ జాతీయ జెండాకు వందనం సమర్పించారు.

**బాలానగర్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** బాలానగర్ మండల కేంద్రంతో పాటు మండలంలోని ప్రతి గ్రామంలో 80 వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బాలానగర్ మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయ ఆవరణలో తహసిల్దార్ శ్రీనివాస్ రెడ్డి, ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో ఎంపీడీవో అనిల్ కుమార్‌రెడ్డి, పోలీస్ స్టేషన్లో ఆవరణలో ఎస్ఐ నరేందర్ రెడ్డి, గ్రామపంచాయతీ కార్యాలయ ఆవరణలో సర్పంచ్ వెంకటేశ్వర్ రెడ్డి, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయ ఆవరణలో డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్ రెడ్డి జాతీయ జెండాను ఎగరవేశారు.

**మదనాపురం, ఆగస్టు 15 ప్రభాతవార్త:** స్వతంత్ర దినోత్సవం పురస్కరించుకొని మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయలో తహసీల్దార్ రేపోలు రాజు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో ఎంపిడిఓ ప్రసన్న కుమార్, కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, నాయకులు రామకృష్ణ, వెంకటనారాయణ, వేమన్న, గోపి స్వామి, చాంద్ పాషా, ఆవుల బాలకృష్ణ, ఆవులరాఘవేంద్ర, ఉపాధ్యాయులు కృషి విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

**గద్వాల ఆగస్టు 15, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల్ జిల్లా మెడికల్ అసోసియేషన్ సభ్యులు శనివారము 80వ స్వతంత్ర దినోత్సవ వేడుకలను అసోసియేషన్ బిల్డింగ్‌నందు ఘనంగా జరుపుకున్నారు. అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహంకాళి సురేష్ జాతీయ జెండాను ఆవిష్కరించారు. అనంతరం అసోసియేషన్ సభ్యులతొకలసి జాతీయ గీతాన్ని ఆలపించారు .కార్యక్రమంలో జనరల్ సెక్రటరీ వీకే కృష్ణ, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.

**నర్వ, ఆగస్టు 15 ప్రభాతవార్త :** స్వాతంత్ర్య దినోత్సవాన్ని నర్వ మండల వ్యాప్తంగా శనివారం ఘనంగా నిర్వహించారు. నర్వ కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద తహసీల్దార్ మల్లారెడ్డి, ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీడీఓ టి శీనివాసులు, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో ప్రధానోపాధ్యాయులు సునీత, ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు వేణుగోపాల్ రెడ్డి, పోలీస్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఎస్సై పబ్బతి రమేష్, సహకారసంఘం వద్ద చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, ఎల్క్ట్రిసిటీ వద్ద ఏఈ రాజేందర్ గౌడ్, ప్రతిభ హై స్కూల్ లో కరస్పాండెంట్ టి హన్మంతు రెడ్డి, ఎస్విఎం పాఠశాలలో సత్యం, వివిద కార్యాలయాలు, గ్రామ పంచాయతీ, అంగన్వాడి కేంద్రాల వద్ద త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించారు.

**పానగల్, ఆగస్టు 15 ప్రభాతవార్త:** మండల కేంద్రంలో పాటు మండలంలోని ఆయా గ్రామాలలో 80 వ స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పాన్‌గల్ మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ వద్ద ఎస్ఐ కురుమయ్య, గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎక్బాల్, మండల విద్యాధికారి కార్యాలయంలో ఎంఈఓ ఆనంద్, వెటర్నరీ హాస్పిటల్ వద్ద డా. సురేష్, జూనియర్ కళాశాలలో ప్రిన్సిపాల్ తిరుమల రావు, మండల మహిళా సమైక్య భవనం వద్ద ఏపీఎం శ్రీనివాసులు, సింగిల్ విండో కార్యాలయంలో చైర్మన్ మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి, ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డా. మైథిలీ, ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో గోవిందరావు, తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ కార్తీక్ రావు, కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద పార్టీ అధ్యక్షుడు వెంకటేష్ నాయుడు, బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద మండల పార్టీ అధ్యక్షుడు పెబ్బేటి వీర సాగర్ జాతీయ జెండాను ఎగరవేశారు. ముఖ్యంగా మండల కేంద్రంలో ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పురవీధుల గుండా.. తిరుగుతూ నృత్యాలు అలరించాయి. మండలంలోని వివిధ గ్రామాలలో గ్రామ పంచాయతీ కార్యాలయాల వద్ద సర్పంచులు, పాఠశాలల్లో ప్రధాన ఉపాధ్యాయులు జాతీయ జెండాను ఎగురవేసి స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ గోవర్ధన్ సాగర్, మాజీ ఎంపీపీ శ్రీధర్ రెడ్డి, మాజీ జడ్పిటిసి రవి, కాంగ్రెస్ నాయకులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**శ్రీరంగాపూర్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** 80 స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని శ్రీరంగాపూర్ మండలంలో స్వతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించడం జరిగింది. ఇందులో భాగంగా శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్ నందు ఎస్సై హిమబిందు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి త్రివర్ణ పతాకానికి గౌరవ వందనం చేయడం జరిగింది. ఉత్తమ సేవలకు గాను ప్రశంసా పత్రం అందుకున్న శ్రీరంగాపూర్ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ మన్యపు రెడ్డిని పోలీస్ సిబ్బంది మండల నాయకులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై హిమబిందు, ఏఎస్ఐ మన్యపు రెడ్డి, పోలీస్ సిబ్బంది, శ్రీరంగాపూర్ ఉపసర్పంచ్ కళ్యాణి కారి కాజా, వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి శ్రీహరి రాజు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు విష్ణు ముదిరాజు, టౌన్ అధ్యక్షులు కుమ్మరి గోవిందు, వర్కింగ్ ప్రెసిడెంట్ రామచందర్ యాదవ్, బహుజన రమేష్ తదితరులు పాల్గొన్నారు.

**గోపాల్ పేట, ఆగస్టు 15 ప్రభాతవార్త:** వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కర్రోళ్ల స్వప్న భాస్కర్ గ్రామపంచాయతీ కార్యాలయంతో పాటు అంబేద్కర్ విగ్రహం, గాంధీ విగ్రహం వద్ద జాతీయ జెండాలను ఆవిష్కరించారు. అనంతరం జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాంలు, పుస్తకాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, గ్రామ పెద్దలు, నాయకులు, యువకులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాలరాజు, కారోబార్ ఎండి బాబు, ఉపసర్పంచ్ కేశవులు, మన్యం నాయక్, ఎద్దుల గోపాల్, ఓంకార్, మూర్తి, శివన్న, శేఖర్ తదితరులు, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

**రేవల్లి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** రేవల్లి మండల కేంద్రంలో స్వతంత్ర దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. తహసిల్దార్ కార్యాలయంలో సరస్వతి , పోలీస్ కార్యాలయంలో రజిత, ఎంపీడీవో కార్యాలయంలో అలీ కీర్తన, రేవల్లి విద్యుత్ కార్యాలయంలో ఇంచార్జ్ ఏఈ సురేష్ చారి, జెండా ఆవిష్కరణ చేశారు. ఈకార్యక్రమంలో అధికారులు, ఉపాధ్యాయులు, నాయకులు విద్యార్థులు, మహిళలు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల ప్రిన్సిపాల్‌కు ఉత్తమ అవార్డు

**బిజినేపల్లి, ఆగస్టు 15 ప్రభాతవార్త:** 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో సందర్భంగా మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సుమతి కి ఉత్తమ ప్రిన్సిపాల్ అవార్డు అందుకుంది. విద్యార్థుల విద్యాభివృద్ధి, క్రమశిక్షణ, వ్యక్తిత్వవికాసం, క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు పాఠశాల సమగ్ర అభివృద్ధికి కృషి చేసినందుకు గాను స్వాతంత్ర దినోత్సవ వేడుకల్లో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల్ల చిన్నారెడ్డి, ఎంపీ మల్లురవి, ఎమ్మెల్యే వంశీకృష్ణ చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రిన్సిపల్ కు అభినందనలు తెలిపారు.

## భూత్పూర్ పీహెచ్‌సీ హెచ్‌ఏ ప్రమోద్‌కు ఉత్తమ ఉద్యోగి అవార్డు

**భూత్పూర్, ఆగస్టు 15, ప్రభాతవార్త:** వైద్య రంగంలో ఉత్తమ సేవలందించిన భూత్పూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో పనిచేస్తున్న హెల్త్ అసిస్టెంట్ ప్రమోద్‌కుమార్ ఉత్తమ ఉద్యోగి అవార్డును అందుకున్నారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా జిల్లా కేంద్రంలో శనివారం మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ ఖుష్బూ గుప్తా చేతుల మీదుగా ప్రమోద్‌కుమార్ ఉత్తమ ఉద్యోగి అవార్డు అందుకున్నారు.

## ఉత్తమ సేవలకు ప్రశంసా పత్రాలు

**కెటిదొడ్డి ఆగస్టు 15, ప్రభాతవార్త:** జోగులాంబ గద్వాల నియోజకవర్గంలో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా జిల్లాలో ఉత్తమ సేవలు అందించిన పలువురు ప్రభుత్వ అధికారులను జిల్లా యంత్రాంగం సత్కరించింది. శనివారం జిల్లా పరేడ్ గ్రౌండ్‌లో జరిగిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ చేతుల మీదుగాఉత్తమ సేవా ప్రశంసా పత్రాలు అందజేశారు. ప్రశంసా పత్రాలు అందుకున్న వారు: కెటిదొడ్డి మండల పరిషత్ అభివృద్ధి అధికారి :రమణారావు, తహసీల్దార్,:కరుణాకర్, ఎస్ఐ: పి. శ్రీనివాసులు, నందిన్నె ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయురాలు:చందన కుచినేర్ల వ్యవసాయ విస్తరణ అధికారి:కిరణ్ కుమార్, కొండాపురం గ్రామ సర్పంచ్:పవన్ కుమార్, ఈ కార్యక్రమంలో గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణ మోహన్ రెడ్డి, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు, రాష్ట్ర గొర్రెలు మరియు బర్రెల అభివృద్ధి సహకార సమాఖ్య చైర్ పర్సన్ సరిత, గద్వాల మున్సిపల్ చైర్ పర్సన్ తుమ్మల జయలక్ష్మీ ్మ, జిల్లా అదనపు కలెక్టర్లు, తదితరులు పాల్గొని ఉత్తమ సేవలు అందించిన ఉద్యోగులందరిని అభినందించారు.

## ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం

**గోపాల్ పేట, ఆగస్టు15 ప్రభాతవార్త:** స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఏదుట్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలో ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. సర్పంచ్ పెద్దిరెడ్డి సునీతా రాజవర్ధన్ రెడ్డి, ఉపసర్పంచ్ రాజేష్ చారితో పాటు వార్డు సభ్యులు పాల్గొన్నారు. పదో తరగతి ఫలితాల్లో మండల స్థాయిలో ఏదుట్ల గ్రామాన్ని ప్రథమ స్థానంలో నిలబెట్టి 100 శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేసిన ఉపాధ్యాయులను ఈ సందర్భంగా సన్మానించారు. విద్యార్థుల విజయానికి ఉపాధ్యాయుల కృషి అభినందనీయమని సర్పంచ్ పేర్కొన్నారు.

## ఉత్తమ సేవలకు అవార్డు

**పాన్‌గల్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** మండలంలోనీ ఆయా శాఖల లో విదులు నిర్వహిస్తున్న ప్రభుత్వ ఉద్యోగులకు వారు చేసిన సేవలను గుర్తించి అవార్డులను ప్రకటించారు. శనివారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన స్వాతంత్ర దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి ఎమ్మెల్సీ పట్నం మహేందర్ రెడ్డి వనపర్తి శాసనసభ్యులు తూడి మెగా రెడ్డి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి చేతుల మీదుగా డిప్యూటీ తహసిల్దార్ అశోక్ కుమార్, కానిస్టేబుల్ ఆజ్మద్దీన్, ఏఎన్ఎం సుమిత్రలు అవార్డులు అందుకున్నారు. విధి నిర్వహణలో భాగంగా వారు చేసిన సేవలకు ప్రభుత్వం గుర్తించి అవార్డులు అందజేయడం అభినందనీయమన్నారు. అవార్డు అందుకున్న ఉద్యోగులను మండల ప్రజలు అభినందించారు.

## దేవరకద్ర ఎంపీడీవోకు ఉత్తమ పురస్కారం

**దేవరకద్ర, ఆగస్టు 15 ప్రభాతవార్త:** ప్రజలకు అందుబాటులో ఉండి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న దేవరకద్ర ఎంపీడీవో శ్రీనివాసరావుకు ఉత్తమ సేవా పురస్కారం లభించింది. స్వాతంత్ర దినోత్సవంలో భాగంగా జిల్లా కలెక్టర్ కుష్బూ గుప్తా, రాష్ట్రమంత్రి జూపల్లి కృష్ణారావు, దేవరకద్ర ఎమ్మెల్యే మధుసూదన్ రెడ్డి చేతుల ఎంపీడీవో శ్రీనివాసరావు ఉత్తమ అవార్డు అందుకున్నారు. ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో సమస్తవంతంగా అమలుచేయడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన సేవలను అందించడంలో ఎంపీడీవో శ్రీనివాసరావు చేస్తున్న ఖుషికి ఈ అవార్డ్ గుర్తింపుగా నిలిచింది. దేవరకద్ర మండలంలో ప్రజలకు అందుబాటులో ఉండి, అనతికాలంలోనే మంచి అధికారిగా గుర్తింపు పొందారు. అవార్డు అందుకున్న సందర్భంగా శ్రీనివాస్ రావుకు, దేవరకద్ర మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, అధికారులు, సిబ్బంది, ప్రజలు, అభినందనలు తెలిపారు.

## విద్యార్థులకు బహుమతుల ప్రదానం

**పాన్‌గల్, ఆగస్టు15 ప్రభాతవార్త:** మండలం పరిధిలోని గోప్లాపూర్ మండల పరిషత్ పాఠశాలకు చెందిన నలుగురు విద్యార్థులు గురుకుల సీట్లు సాధించారు. శనివారం స్వాతంత్ర దినోత్సవ వేడుకల సందర్భంగా సింగిల్ విండో డైరెక్టర్ సాయి ప్రసాద్ గౌడ్ విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రోత్సాహక బహుమతులను సర్పంచ్ రాజ గౌడ్ చేతుల మీదుగా విద్యార్థుల తల్లిదండ్రులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో విద్యార్థులు మరిన్ని సీట్లు సాధించి పాఠశాలకు, తల్లి దండ్రులకు పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షిస్తున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ బాలకృష్ణ, మాజీ ప్రజా ప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఉడిత్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు విరాళం

**బాలానగర్, ఆగస్టు 15 ప్రభాతవార్త :** ఉడిత్యాల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు 80వ స్వాతంత్ర దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని గ్రామ నాయకుడు పోత్రపల్లి రమేష్ రెండు లక్షల రూపాయల భారీ విరాళాన్ని పాఠశాల నిర్వహణ ఖర్చులకు అందజేశారు. ఈ మొత్తాన్ని పాఠశాల యొక్క జాయింట్ అకౌంట్ లో ఫిక్స్ డిపాజిట్ చేసి దానికి వచ్చే వడ్డీ, అవసరాన్ని బట్టి డిపాజిట్‌నుపాఠశాల నిర్వహణకు ఉపయోగించు కోవాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానో పాధ్యాయులు సురేష్ కుమార్, గ్రామస్తులు రమేష్ ను అభినందించారు.

## ఫుడ్ స్టోరేజ్ గోడౌన్ నిర్మాణానికి భూమి పూజ

**శ్రీరంగాపూర్, ఆగస్టు15 ప్రభాతవార్త:** శ్రీరంగాపూర్ మండలంలోని నగరాల గ్రామ రైతులు పండించిన ధాన్యాన్ని నిల్వ ఉంచుకోవడానికి ఇబ్బందిగా ఉన్న తరుణంలో ఈ విషయాన్ని గ్రామ సర్పంచ్ మహాదేవ్ సాగర్ వనపర్త ఎమ్మెల్యే తూడి మెగా రెడ్డికి వివరించగా వెంటనే స్పందించి 30 లక్షలతో ఫుడ్ స్టోరేజ్ గోడౌన్‌కు అనుమతించారు. ఇందులో భాగంగా శనివారం నగరాల రెండో సెంటర్లో ఫుడ్ స్టోరేజ్ గోడౌన్ సర్పంచ్ గుంటి మహదేవ్ సాగర్ భూమి పూజ చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో సర్పంచ్ గుంటి మహదేవ్‌తో పాటు ఉపసర్పంచ్ సి.కురుమయ్య శ్రీరంగాపూర్‌మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు ఆర్.నరేందర్‌రెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# బడుగు, బలహీన వర్గాల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం

● శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి ● జిల్లాలో 1,83,013 స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ

**వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 15, ప్రభాతవార్త :** వనపర్తి జిల్లా కేంద్రంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా స్థాయిలో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. శాసనమండలి ప్రభుత్వ చీఫ్ విప్ డా. పట్నం మహేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీని ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, వనపర్తి ఎమ్మెల్యేతూడి మేఘారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి చేతుల మీదుగా పలువురు లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ మేరకు ముఖ్య అతిథి పట్నం మహేందర్ రెడ్డి మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమమే లక్ష్యంగా పనిచేస్తోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారంటీల అమలుతో పాటు అర్హులైన పేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డులను అందిస్తున్నామని పేర్కొన్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను లబ్ధిదారులకు అందిస్తున్నామని తెలిపారు. వనపర్తి జిల్లాలోని 15 మండలాలు, 5 మున్సిపాలిటీల పరిధిలో మొత్తం 1,83,013 స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో కొత్తగా 26,465 రేషన్ కార్డులనులబ్ధిదారులకు అందిస్తున్నామని చెప్పారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్ నెలలకు సంబంధించిన సన్నబియ్యాన్ని ఒకేసారి పంపిణీ చేస్తున్నామని తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందన్నారు. వనపర్తి నియోజకవర్గ అభివృద్ధికి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి చేస్తున్న కృషిని చీఫ్ విప్ ప్రశంసించారు. ఇప్పటికే నియోజకవర్గ అభివృద్ధి కోసం సుమారు రూ.2 వేల కోట్ల నిధులు మంజూరు చేయించి పలు అభివృద్ధి పనులు చేపట్టారని తెలిపారు.



లబ్ధిదారులకు డిజిటల్ రేషన్ కార్డును పంపిణీ చేస్తున్న పట్నం మహేందర్ రెడ్డి

**ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి**

ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించుకోవడం ఆనందంగా ఉందన్నారు. సంగారెడ్డి జిల్లాలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రాష్ట్ర స్థాయి కార్యక్రమం ప్రారంభం కాగా, వనపర్తిలో జిల్లా స్థాయిలో ముఖ్య అతిథి పట్నం మహేందర్ రెడ్డి చేతుల మీదుగాకార్యక్రమాన్ని ప్రారంభించుకోవడం సంతోషకరమన్నారు. ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళలకు మహాలక్ష్మి ్మ పథకం కింద ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించిందన్నారు. రాజీవ్ ఆరోగ్యశ్రీ పథకం పరిమితిని రూ.5 లక్షల నుంచి రూ.10 లక్షలకు పెంచి పేదలకు అండగా నిలిచిందన్నారు. అర్హులైన వారికి రేషన్ కార్డులు జారీ చేయడంతో పాటు సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులకు రూ.2 లక్షల లోపు పంట రుణాలను మాఫీ చేయడంతో పాటు రైతు భరోసా అందిస్తున్నామని ఎమ్మెల్యే పేర్కొన్నారు. వనపర్తి జిల్లాలో 1.83 లక్షల స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా మహిళా సంఘాలకు బస్సులు అందించి వాటిని ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా మహిళలకు ఆదాయ మార్గాలను కల్పిస్తున్నామని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం మొదటి విడతలో నియోజకవర్గానికి 3,500 ఇళ్లు, రెండో విడతలో మరో 2,000 ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. వనపర్తి నియోజకవర్గంలో గుడిసెల్లో నివసిస్తున్న కుటుంబాలకు ఇళ్లు మంజూరు చేసి గుడిసెలు లేని వనపర్తిని నిర్మించడమే లక్ష్యమన్నారు. వనపర్తిలో రూ.200 కోట్ల అంచనా వ్యయంతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఐటీటవర్, ఇందిరా మహిళా శక్తి భవనం మంజూరైనట్లు తెలిపారు. ముఖ్యమంత్రి చదివిన పాఠశాల, కళాశాల అభివృద్ధికి సుమారు రూ.50 కోట్లతో పనులు చేపడుతున్నామని పేర్కొన్నారు. వనపర్తి, పెబ్బేరు మున్సిపాలిటీల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, వనపర్తిలో నూతన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయ నిర్మాణం కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. వనపర్తి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని ఎమ్మెల్యే స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా స్మార్ట్ రేషన్ కార్డులు అందుకోబోతున్న 1.14 కోట్ల మంది లబ్ధిదారులకు శుభాకాంక్షలు తెలిపారు.

**స్మార్ట్ రేషన్ కార్డుతో మరిన్ని వివరాలు తెలుసుకునే అవకాశం: జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

ఆదర్శ్ సురభి మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా పౌరసరఫరాల శాఖ ఆధ్వర్యంలో స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. వనపర్తిలో జిల్లా స్థాయి కార్యక్రమాన్ని ప్రారంభించుకుని, అనంతరం ఆయా మండలాల్లో కార్డుల పంపిణీ కొనసాగుతుందని చెప్పారు. జిల్లావ్యాప్తంగా 1,83,013 మంది లబ్ధిదారులకు స్మార్ట్ డిజిటల్ రేషన్ కార్డులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుపై ఉన్న బార్‌కోడ్‌ను స్కాన్ చేయడం ద్వారా రేషన్ షాపు వివరాలు, లబ్ధిదారులకు అందే రేషన్ వివరాలతో పాటు ఇతర సంబంధిత సమాచారాన్ని తెలుసుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ వివరించారు. అర్హులైన లబ్ధిదారులకు రేషన్ కార్డులు సకాలంలో అందేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రెవెన్యూ వినోద్ కుమార్, పౌరసరఫరాల డిఎం ఆంజనేయులు, వనపర్తి మున్సిపల్ చైర్ పర్సన్ మాధవి, వైస్ చైర్మన్ మధుసూదన్ గౌడ్, పెబ్బేరు మున్సిపల్ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, పెబ్బేరు మార్కెట్ యార్డ్ చైర్మన్ ప్రమోదిని, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సంబంధిత ప్రజాప్రతినిధులు, జిల్లాఅధికారులు, పౌరసరఫరాల శాఖ అధికారులు, లబ్ధిదారులు, ఇతరసంబంధితఅధికారులు పాల్గొన్నారు.

